టైము తక్కువే అయింది, ఏడే.

బయట చీకటీ, గాలీ రెండూ ఎక్కువే.

పిల్లలిద్దరూ మంచి నిద్రలో ఉన్నారు.

సాయంత్రం బాగా ఆడారు.

అలిసిపోయి అన్నం తిన్నవెంటనే నిద్రపోయారు.

పిల్లలు సాయంత్రంపూట బాగా ఆడుకోడమే మంచిది.

చక్కని నిద్ర పడుతుంది. వాళ్లకే చీకూ, చింతా ఉండదు.

బయట హోరున గాలి. ఇంక వాన మొదలవుతుంది.

'పెద్దవానే కురవచ్చు. కరెంటు పోతుందేమో కూడా.' ఆలోచిస్తూ పిల్లలకి దుప్పటి సరిగ్గా కప్పి, రెండు లాంతర్లు వెలిగించి ఒకటి వంటింటిగుమ్మంలో పెట్టి ఇంకోటి ముందుగదిలో పిల్లలు పడుకున్నచోట పెట్టి, అక్కడే కిటికీకి దగ్గిరగా స్టూల్ లాక్కుని, బయటికి చూస్తూ కూర్చుంది శ్రీవల్లి.

పెద్దవాన వచ్చే సూచనలే కనిపిస్తున్నాయి.

వాన కురుస్తూంటే కిటికీదగ్గిరగా కూర్చుని ఆ వాన చూడటం చిన్నప్పటినించీకూడా సరదా.

కానీ ఇప్పుడా వాన చూడాలన్న సరదాతో కాదు కూర్చున్నది.

మనస్సంతా నిండిన ఆశతో, ఆత్రతతో కావలిసిన మనిషికోసం, మమత నిండిన మనస్సుకోసం ఎదురుచూస్తూ కూర్చుంది.

ఇంక కొంచెంసేపట్లో వర్షం కురుస్తుంది.

హఠాత్తుగా ఆ వర్షంలో ఆయ నిక్కడికి వస్తే... వస్తేకాదు తప్పకుండా రావాలి. అందుకోసమేగా ఇక్కడ కూర్చుని ఇలా ఎదురుచూడటం! తన ఆలోచనకి తనకే నవ్వు వస్తూంది. తనిక్కడున్నట్టు ఆయనకేం తెలుసు? పోనీ తెలిసి కాదు. వానలో కాస్సేపు తల దాచుకోడానికి ఇక్కడికి వచ్చి నిలబడితే ... తనని చూసి "వల్లి" అంటూ నిండుమనస్సుతో అక్కున చేర్చుకోరూ? వెచ్చని కన్నీటితో తను ఆయన పాదాలు కడగదూ! తన జీవితాన్ని పూలబాటగా ఆయనముందు పరవదూ! తను పిచ్చిగానీ! ఆయన వస్తారా? అయన కోసం ఎదురుచూడటం ఎన్నాళ్లనించో తన కలవాటై పోయింది. అందులో వర్షం కురిసినరోజు తప్పకుండా ఎంతో ఆశతో, గుండెలో గూడు కట్టిన వేదనతో, ఏదో తెలియని నమ్మకంతో, మనసు చిక్కబట్టుకుని, వెచ్చని కన్నీటితో ఎదురుచూడటం మానదు.

మెరుపు మెరిసింది.

పిడుగు పడిం దెక్కడో!

కరెంటు పోయింది. ముందే లాంతర్లు వెలిగించి ఉంచడం మంచిది అయిందనుకుంటూ పిల్లలవంక ఒకసారి చూసి నిట్టూర్చింది శ్రీవల్లి.

రోజూ తనకి సాయం పడుకుందుకు రాత్రిళ్లు రంగమ్మ వస్తుంది. ఇవాళ రాకపోవచ్చు. ఎలా వస్తుంది? ఇంకొంచెంసేపట్లో పెద్దవాన కురుస్తుందాయె. అవును. వాన కురుస్తుంది. ప్రకృతి చల్లబడుతుంది. కానీ తన మనస్సు ఎప్పటికి చల్లబడుతుంది? తన జీవితంలో శాంతి ఎప్పటికి చేకూరుతుంది? ఈ సంఘానికి తనమీద ఉన్న అనుమానాలు ఎప్పటికి పోతాయి? ఈ లోకం తనని గౌరవంగా ఎప్పటికి చూస్తుంది? ఎటు చూసినా ప్రశ్నలే. దేవుడు తనని కరుణిస్తేతప్ప లేకపోతే తన జీవితం ఈ ప్రశ్నలలో మునిగి ఈ చీకటిలోనే అంతరించిపోతుంది. కన్నీటితో శ్రీవల్లి చెంపలు తడిసిపోయాయి.

మళ్లీ పిడుగు పడినట్టుంది ఎక్కడో.

ఆ శబ్దానికి జడుసుకున్న పక్కింటి పిల్లాడు కేరుమన్నాడు.

ఆకాశంలో మెరుపులు అప్పుడప్పుడు కదులుతూ కాంతినిస్తున్నాయి.

శ్రీవల్లి కళ్లముందు గతం ఎప్పుడూ కదులుతూ చీకటి నింపుతుంది.

వయస్సు మీరిన, జబ్బుతోఉన్న మామగారూ, అత్తగారూ, అస్తమానం జ్వరాలతో సరైన మందులూ, తిండీ లేక చిక్కిపోతున్న పిల్లలూ, పొద్దున్న లేచింది మొదలు రాత్రి పడుకునేవరకుకూడా తెమలని పని, సేవా —వీటితో నీరసించిపోతున్న తనూ, పొద్దుటినించీ సాయంత్రంవరకూ కష్టపడి పనిచేసి నెలాఖరున దొరికే చాలీచాలని జీతం తీసుకువచ్చే ఆయన . . . ఇదీ కుటుంబం. తనేదో తప్పు చేసినట్టు తనని కోపంగా చూసేవారు ఆయన.

తన తప్పేమిటో ఇప్పటికీ తన కర్థంకాదు.

చాలీచాలని జీతం తెచ్చే భర్త దొరికాడేమిటని ఎప్పుడైనా బాధపడిందా? కలలోనైనా ఆయన గురించి చెడ్డగా అనుకుందా? లేదే! మనఃస్ఫూర్తిగా ప్రేమించింది ఆయన్ని! ఆయ నెంత చెపితే అంత. ఎలా చెబితే అలా నడుచుకునేది.

ఆరోజు రాత్రి అంది తను "ఏమండీ! చంటివాడికి గేదెపాలుగానీ, ఆవుపాలుగానీ పడటంలేదు. వాడి

తమిరిశ జానకి

ఆరోగ్యం బాగా పాడైంది. డాక్టరేమో డబ్బాపాలు వాడటం మంచిదన్నాడు."

"అయితే! నెలకి మూడు నాలుగు డబ్బాలన్నా కొనాలా? ఎక్కడినించి తెమ్మంటావు డబ్బు?" కోపంతో ఎగిరిపడ్డారాయన.

తెల్లబోయి చూడటం తప్ప మరేమీ అనలేక పోయింది తను.

అప్పుడే మామగారు పిలిచారు.

"ఏమిటి?" అంటూ విసుగ్గా వెళ్లి తండ్రి మంచంపక్కన నిలబడ్డారు.

"ఒరే! చంటివాడి ఒంట్లో బొత్తిగా బాగులేదు. డబ్బాపాలు వాడమన్నాట్ట డాక్టరు. నీ సిగరెట్లకి తగలేసే డబ్బు వాడి పాలడబ్బాలకోసం ఖర్చుచెయ్యలేవుట్రా?" మామగారి దీనస్వరం విని కళ్లల్లో నీళ్లు తిరిగాయి శ్రీవల్లికి.

"నా సిగరెట్లు అడ్డు వచ్చాయా మీకు? నా ఇష్టం వచ్చినట్టు తగలేసుకుంటాను! మీరెవరూ నాకు చెప్పక్కర్లేదు! ఛీ! బొత్తిగా సుఖంలేదీ ఇంట్లో. ఈ ఇల్లూ అక్కర్లేదు, ఈ సంసారం అక్కర్లేదు. ఈ బరువు నేను మొయ్యలేను." చెప్పులు తొడుక్కుని విసురుగా బయటికి నడిచా రాయన.

ఆరోజూ ఇలాగే ఉంది వాతావరణం. హోరున గాలి. దట్టంగా కమ్ముకున్న మబ్బులు. సన్నగా వాన.

ఆయనవెనకే గుమ్మందాకా పరిగెత్తింది తను "ఏమండీ!" అంటూ.

ఆ పిలుపు గాలి హోరులో కలిసిపోయింది. ఆయన చీకటిలో కలిసిపోయారు.

ఏడ్చి ఏడ్చి అలిసిపోయింది తను. "ఊరుకోమ్మా, వాడే వస్తాడు. అయినా ఈమాత్రందానికే అలిగి పోవటమేమిటి చెప్పు?" మామగారి మాటలు తన బాధ తగ్గించలేకపోయాయి.

వర్షంలో ఎక్కడ తడుస్తున్నారో ఏమో, తెల్లారికైనా ఇంటికి వస్తారో రారో? ఇవే ఆలోచనలు, ఇదే బాధ రాత్రిఅంతా.

మరునాడు కాదుకదా ఇంతవరకూ ఆయన జాడ తెలియనే తెలియదు. ఆయన వెళ్లిన కొద్దిరోజులకే దిగులుతో అత్తా, మామగారూ పోయారు. పెద్ద పిల్ల బెంగతో మరింత చిక్కిపోయింది. చంటివాడికేమీ తెలియదు. దగ్గిరివాళ్లు నా అన్నవాళ్లెవరూ ఇంక లేరు. ఏంచెయ్యాలో దిక్కుతోచని సమయంలో రాఘవయ్య గారి దయవల్ల ఈ ఊళ్లో ఎలిమెంటరీ స్కూల్లో టీచర్ కాగలిగింది. మళ్లీ ఆయ నెప్పుడైనా ఆ ఊరు వస్తే, ఎవరికైనా కనిపిస్తే తన అడ్రస్ ఆయన కివ్వమనిచెప్పి ఆ ఊళ్లో ఇద్దరుముగ్గురికి ఇచ్చే వచ్చింది. కానీ ఇంతవరకూ ఎవరికీ ఆయన సంగతి తెలియలేదు.

వాన మొదలైంది. గాలితీవ్రత కొంచెం తగ్గింది.

అప్పుడప్పుడు వానజల్లు కిటికీలోంచి చల్లగా కొడుతూంది మీద. అలా అప్పుడప్పుడు వానజల్లు చల్లగా తగులుతూంటే ఎంతో హాయిగా ఉంటుంది. అందుకే కిటికీదగ్గిర్నించి కదల్లేదు శ్రీవల్లి.

పెద్ద మెరుపు నాట్యం చేసింది.

గేటు తీసిన చప్పుడైంది.

ఉలిక్కిపడి చూసింది. ఇద్దరు వ్యక్తులు లోపలికి వస్తున్నారు.

ఒకరు స్త్రీ; మరొకరు పురుషుడు. ముఖాలు మాత్రం స్పష్టంగా కనిపించటంలేదు.

ఇద్దరూ వరండాలోకి వచ్చి నిలబడ్డారు. అమ్మాయి చీరకొంగుతో తల అద్దుకుంటూంది. అతని చేతిలో సూట్‌కేసుంది.

వానలో తల దాచుకుందుకు వచ్చినవాళ్లని తెలుస్తూనే ఉన్నా మెల్లిగా అడిగింది శ్రీవల్లి "ఎవరూ?" అంటూ.

"వాన కురుస్తూందని ఇక్కడ నిలబడ్డామండీ! కొద్దిగా తగ్గగానే వెళ్లిపోతాం." అమ్మాయి కంఠం జవాబిచ్చింది.

తలుపు తీసి లోపలికి వచ్చి కూర్చోమంది శ్రీవల్లి.

అతనక్కడే గోడవారగా ఉన్న బల్లమీద కూర్చున్నాడు. ఆ అమ్మాయి మాత్రం లోపలికి వచ్చింది.


"తల తుడుచుకుంటారా?" అడగకుండా ఉండలేక పోయింది.

"అబ్బే! అక్కర్లేదండీ. అట్టే తడవలేదు."

అయినా కూడా తువ్వాలు తెచ్చి ఇచ్చింది శ్రీవల్లి. ఏద్దనలేక తీసుకుంది ఆ అమ్మాయి.

"ఈ ఊరేనా మీది?" ఏదో మాట కలపాలి కదా అన్నట్టు అడిగింది.

"కాదండీ! ఆఫీసు పనిమీద ఆయనీ ఊరు వస్తూంటే ఊరు చూడవచ్చుకదా అని నేనూ వచ్చాను. ఇప్పుడు స్టేషన్‌కి వెళుతున్నాం మా ఊరు వెళ్లడానికి. ఇంకా చాలా టైముందనుకోండి రైలుకి. అందుకే మెల్లిగా నడిచి వెళదాం. అంతగా దోవలో వాన వస్తే




బ్రతుకుమీద ఆశ పెంచుకున్న వానికి సంసారభారం భారం అనిపించకపోవచ్చు. ఆశ నిరాశ అయిన, మిణుకుమనే చిన్న దీపం కొండెక్కిన అతివకు, జీవితమే వానలో మంట అవుతుంది.

రిక్షా ఎక్కవచ్చు అనుకున్నాం. ఒక్క రిక్షా లేదండీ రోడ్డుమీద ఎక్కడాను." చెప్పడం ముగించింది.

కాసేపు ఇద్దరికీ ఏం మాట్లాడాలో తోచలేదు.

"మీవారి పేరు?" నిశ్శబ్దాన్ని విడదీసింది చివరికి శ్రీవల్లి.

ముద్దుగా సిగ్గుపడుతూ చెప్పిందా అమ్మాయి "గోవిందరావుగారు" అని.

ఉలిక్కిపడింది శ్రీవల్లి మనసు. మరుక్షణంలో తనని తనే నచ్చ చెప్పుకుంది 'ఎంతమంది కుండదా పేరు!'

'ఇలా వర్షం కురిసినరోజు ఆయన మౌనంగా ఏదో ఆలోచిస్తున్నట్లుంటారు. మొదటి భార్య గుర్తుకి వస్తుందేమో అనుకుంటాను.'

ఆశ్చర్యపడింది శ్రీవల్లి హృదయం. 'మొదటి భార్య!' మనసులో అనుకున్న మాటలు పైకే వచ్చేశాయి.

"అవునండి. నన్ను చేసుకునేటప్పుడు చెప్పారాయన. 'మొదటిభార్య పోయిందని, నా అన్నవాళ్ళెవరూ ఇంక లేరని. లేకపోతే నాకెలా తెలుస్తుంది? నాకూ ఎవ్వరూ లేరు. ఆయనే నా ప్రాణం. నా సర్వస్వం."

అంత చటుక్కుగా, కలుపుగోలుగా మాట్లాడేస్తున్న ఆ అమ్మాయిని పరికించి చూస్తూ ఆలోచనలోపడింది శ్రీవల్లి.

"మీ వారింట్లో లేనట్లున్నారే?" పిల్లలవంక చూస్తూ ఆ అమ్మాయి అడిగిన ప్రశ్నకి ఏంచెప్పాలో తెలియక తల అడ్డంగా ఊపింది.

వాన తగ్గుముఖం పట్టింది.

ఒకసారి వరండాలో కూర్చున్న అతని ముఖం చూడాలి.

ఒకవేళ ఈ గోవిందరావు తన భర్త గోపాలరావే అయితే?

ఇన్నాళ్ళూ ఆయన రాకకోసం ఎదురుచూస్తూంది. ఇప్పుడు కొత్త సమస్య ఎదురైంది. ఎలాగైనాసరే వెలుగులో అతని ముఖం చూడాలి.

"పాపం! ఆయన చీకటిలో కూర్చున్నారు. ఒక లాంతరక్కడ పెడితే ..." అంటూ జవాబుకోసం ఎదురుచూడకుండా వెళ్ళి వంటింటిగుమ్మంలో పెట్టిన లాంతరు తీసుకుని, ధైర్యంచేసి, గుండె చిక్కబట్టుకుని గుమ్మం అవతల వరండాలో పెట్టింది. తను లోపలే గుమ్మాని కవతలే నిలబడింది కనిపించకుండా. అతను వర్షాన్ని చూస్తున్నాడు. లాంతరు కింద పెడుతూ ఆ వెలుగులో స్పష్టంగా చూసింది ముఖం. అవును సందేహంలేదు. ఆయనే!

మరుక్షణంలో రివ్వున కిటికీదగ్గిరికి వచ్చేసింది. అంత చలిలోనూ గొంతుక ఎండిపోయి దాహంవేస్తూంది. నోట మాట రావటంలేదు. ఆ అమ్మాయి బయటికి వెళ్ళి అతనితో ఏదో మాట్లాడి మళ్ళీ లోపలికి వచ్చింది. "ఏమండీ, ఇంక మేము వెళతామండీ. వాన తగ్గిపోట్టి."

'ఎలా? ఇప్పుడేంచెయ్యాలి? ఆయన వెళ్ళిపోతున్నారు. నన్నూ, పిల్లల్నీ ఇలా వదిలివేయడం న్యాయమేనా అని అడిగితే? మరి, ఈ అమ్మాయి గతి ఏమవుతుంది? దిక్కులేనిదయిపోదూ? అయినా ఆయన నా మొదటి భార్య పోయింది. నువ్వెవరో నాకు తెలియదంటే? ఈ రాత్రి ఎవర్ని సాక్ష్యం తీసుకురాగలదు? తన దగ్గిర ఆయన ఫొటో అయినా లేదే! ఎంతైనా ఆయన మగవాడు. తను ఆడది. తన మాట ఈ సంఘం లెక్క చెయ్యదు. ఏం చెయ్యా లిప్పుడు?' దిక్కుతోచక బొమ్మలా నిలబడిపోయింది కిటికీదగ్గిర శ్రీవల్లి.

వాళ్ళప్పుడే వరండా మెట్లు దిగారు. ఇంకాస్సేపట్లో గేటు తీసుకుని వెళ్ళిపోతారు. త్వరపడుతూంది మనసు. పిల్లల్ని తీసుకువెళ్ళి ఆయన ముందుంచితే? వీళ్ల భవిష్యత్తేమిటని అడిగితే? అయినా సంసారభారం మొయ్యలేనని ఆరోజు రాత్రి ఇల్లు విడిచి వెళ్ళిపోయిన మనిషి మళ్ళీ సంసారాన్ని ఎందుకు పెంచుకుంటున్నట్టు? అయ్యో! వెళ్ళిపోతున్నారు. పిలవాలి. కంగారుగా రెండడుగులు ముందుకు వేసింది "ఏమండీ" అంటూ. ఆ పిలుపు గొంతులోనే ఉండిపోయింది. ఆ అమ్మాయి చెప్పిన మాటలు చెవుల్లో మోగాయి. మొదటి భార్య పోయిందని చెప్పి ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకున్నారు. ఆ మాటే చాలు, ఆయనకి తనంటే ఇష్టంలేదని చెప్పడానికి. అటువంటప్పుడు తను ఆయన భార్యనని ఎందుకు ఒప్పుకుంటారు? తన మొర ఎందుకు వింటారు? రెండు చేతుల్లోను ముఖం దాచుకుంది శ్రీవల్లి. తనంటే ఇష్టంలేని మనిషితో కాపరం చెయ్యగలదా? వెళ్ళిపోయారు వాళ్ళు. భగవాన్! ఇన్నాళ్ళూ ఎప్పుడైనా ఆయన తప్పకకనిపిస్తారన్న ఆశతో బ్రతుకుమీద ఆశ పెంచుకుంది. ఇప్పు డింక ఏ ఆశతో బ్రతకాలి? ఇంకనించీ ఆయనకోసం ఎదురు చూడవలసిన అవసరం లేదన్నమాట! వర్షం కురిసిన రోజు కిటికీదగ్గిర కూర్చోనక్కర్లేదు.

శ్రీవల్లి తనని తనే తిట్టుకుంది. తను తప్పు చేసిందేమోననిపిస్తూంది. 'ఆ అమ్మాయి గతేమవుతుంది?' అని జాలిపడి వెనకాడింది. ఆయన తన మొర వినరేమోనని తటపటాయించింది. ఆయన కాళ్ళమీద వెళ్ళి పడవలిసింది. ఆ తరవాత ఏదో ఒకటి జరిగేది కానీ ఇప్పుడంతా చెయ్యి దాటిపోయింది. అయిపోయింది ఆపుకోలేని దుఃఖం మనస్సుని మెలిపెడుతూంది గుండెల్లో వేదన కరిగి కన్నీరై స్రవిస్తూనేఉంది.

బయట వాన పూర్తిగా ఆగిపోయింది. ప్రకృతి చల్లగా ఉంది. శ్రీవల్లి కన్నీ రాగలేదు. మెదడు వేడెక్కింది. గుండె మండుతూంది. జీవితాంతం ఆరనీ మంట! వానలో మొదలైన మంట! ★